## మరో రైతు ఆత్మహత్య

- అప్పుల భారంతో మనస్తాపం
- సిద్దిపేట జిల్లా ఎనగుర్తిలో విషాదం



బీరయ్య (ఫైల్)

దుబ్బాక, మార్చి 23 : సాగు కలిసి రాక.. అప్పుల భారం మోయలేక మనస్తాపంతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలో చోటుచేసుకున్నది. అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఎనగుర్తికి చెందిన సిర్ర బీరయ్య(43) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటునానడు. అతనికున్న రెండెకరాల్లో వరి వేశాడు. వాగు పక్కనే పొలం ఉన్నా నీళ్లు లేక పంట ఎండిపోయింది. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. తీవ్ర మనస్తాపంతో ఉన్న ఆయన ఆదివారం ఉదయం 10గంటలకు పశువులకు గడ్డి తెచ్చేందుకు పొలం వద్దకు వెళ్లాడు. అక్కడే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బీరయ్య ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా బీరయ్య చెట్టుకు విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు భూంపల్లి ఎస్సై హరికృష్ణ తెలిపారు.



లక్ష్మీదేవిపల్లిలో రైతు ఎల్కపల్లి నర్సింహులు దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

## కాంగ్రెస్ పాలన రైతులకు శాపం

- వడగండ్ల వానకు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి
- మాజీమంత్రి హరీశ్‌రావు
- వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటల పరిశీలన

సిద్దిపేట/నారాయణరావుపేట, మార్చి 23: వడగండ్ల వానతో చాలా గ్రామాల్లో పంట నష్టం జరిగినందున ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లిలో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు నష్టపోయిన రైతు ఎల్కపల్లి నర్సింలు వరి పంటను, రైతు రామస్వామి బొప్పాయి తోటను ఆదివారం హరీశ్‌రావు పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో హామీఇచ్చి సంపూర్ణంగా చేయలేదని దుయ్యబట్టారు. రూ.2లక్షలకు పైన రుణం ఉన్న రైతులతో పైన డబ్బులు చెల్లించి రుణమాఫీ చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుబంధు రూపంలో కేసీఆర్ రైతులకు నేరుగా సహాయం చేశారని, 11 విడతల్లో రూ.73 వేల కోట్లు రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేసిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా ఎకరాకు రూ.7500 చొప్పున వానకాలం, యాసంగి పంటలకు సంబంధించి రూ. 15 వేల చొప్పున వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క వరంగల్ జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, దీనికారణం కాంగ్రెస్ వైఫల్యం అని ధ్వజమెత్తారు.



బొక్కలోనిపల్లిలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

## వడగండ్ల వానతో రైతుకు తీరని నష్టం

- ఎకరాకు రూ.40 వేలు ఇచ్చి ఆదుకోవాలి : శ్రీనివాస్‌గౌడ్
- పాలమూరు జిల్లాలో దెబ్బతిన్న పంటల పరిశీలన

మహబూబ్‌నగర్, మార్చి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అకాల వర్షాలకు పంటలు దెబ్బతినడంతో రైతులకు తీరని నష్టం చేకూరిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎకరాకు రూ.40 వేల చొప్పున పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణ ఆర్థిక సాయంగా రూ.10 వేలు అందించాలన్నారు. ఈదురుగాలులకు తోడు వడగండ్ల వర్షం పాలమూరు జిల్లాలో బీభత్సం సృష్టించింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు మహబూబ్‌నగర్ మండలం చౌదర్‌పల్లి, జమిస్తాపూర్, కోడూరు, బొక్కలోనిపల్లి, హన్వాడ మండలంలోని కొనగంటిపల్లి, నాయినోనిపల్లి, యారోన్‌పల్లి, సల్లోనిపల్లి, హన్వాడ, మూసాపేట మండలంతోపాటు భూత్పూర్, అడ్డాకులలో పెద్దఎత్తున వరి పంట నేలకొరిగింది. ఆదివారం శ్రీనివాస్ గౌడ్ పలుచోట్ల క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులను పరామర్శించి, పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల తెలంగాణ రైతాంగం దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నదని మండిపడ్డారు. వడగండ్ల వాన పడి పంటలు నష్టపోతే అధికారులు ఎక్కడున్నారు? ప్రశ్నించారు. కనీసం రైతులను ఓదార్చడానికి ఎవరు రాలేదని మండిపడ్డారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేయాలని డిమాండ్ చేశారు.

## 50వేల ఎకరాల్లో పంట నష్టం

- వడగండ్ల నష్టంపై అధికారుల అంతర్గత అంచనా
- 11వేల ఎకరాల్లో పంట దెబ్బతిన్నదన్న ప్రభుత్వం
- సమగ్ర నివేదికకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం





పంట దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు నరేందర్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): రెండు రోజులు కురిసిన వడగండ్ల వర్షానికి ప్రభుత్వ ప్రాథమిక అంచనా ప్రకారం 13 జిల్లాల్లో 11వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పంట నష్టంపై గ్రామాల వారీగా సర్వేచేసి, సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించినట్టు పేర్కొన్నారు. వడగండ్ల వర్షాలతో ఇప్పటివరకు సుమారు 50 వేల ఎకరాలకు పైగా పంట నష్టం జరిగి ఉంటుందని వ్యవసాయశాఖ అంతర్గతంగా అంచనా వేసినట్టు తెలుస్తున్నది. ఇది మరింత పెరిగే అవకాశముందని సమాచారం.

### రైతు కష్టం నేలపాలు

వడగండ్ల వర్షాలకు వరి, మొక్కజొన్న పంటలు భారీగా దెబ్బతిన్నాయి. శనివారం కురిసిన భారీ వడగండ్లతో మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కరివెనలో భారీ పంటనష్టం జరిగింది. దాదాపు గంటపాటు కురిసిన వర్షానికి వరి మొత్తం పాడైపోయింది. నరేందర్‌రెడ్డి అనే రైతుకు చెందిన 10 ఎకరాల వరి పంట చేతికి అందివచ్చిన సమయంలో మొత్తం దెబ్బతిన్నది. నాలుగైదు రోజుల్లో కోసేందుకు సిద్ధమనయ్యామని, ఇంతలోనే నష్టం జరిగిందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఒక్క గింజ కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని వాపోయారు. ప్రభుత్వమే ఆదుకోవాలని విన్నవించారు.

## అకాల వర్షం.. అపార నష్టం



మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం దాసరిపల్లి శివారులో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత వడగండ్ల వర్షానికి నేలకొరిగిన వరిపంట



పాలమూరు జిల్లా మూసాపేట మండలం దాసరిపల్లిలో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత కురిసిన వడగండ్ల వానకు నేల రాలిన మామిడి కాయలను చూయిస్తున్న రైతు భాస్కర్‌గౌడ్



శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత అకాల వర్ష బీభత్సానికి మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం కొనగట్టుపల్లిలో వడగండ్లకు నేల రాలిన పంటను చూపుతున్న రైతు రమణారెడ్డి

## రైతు ఆత్మహత్యాయత్నం

లక్ష్మణచాంద, మార్చి 23 : అధికారుల వేధింపులు భరించలేక ఓ రైతు ఆత్మహత్యకు యత్నించిన ఘటన నిర్మల్ జిల్లాలో చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. లక్ష్మణచాంద మండలం పొట్టపల్లి(కే) గ్రామానికి చెందిన తొడిశెట్టి భూమన్న 30 ఏండ్ల క్రితం పూర్వ రా చాపూర్‌లోని వడ్యాల్ శివారులో ఐదెకరాల భూమిని కొనుగోలు చేశాడు. ఈ భూమి పొట్టపల్లి(కే)కి ఆనుకుని ఉంటుంది. పొట్టపల్లి (కే) గ్రామానికి చెందిన భూమిని తొడిశెట్టి భూమన్న సాగు చేస్తున్నట్టు సదరు గ్రామస్థులు అనుమానించారు. ఈ విషయంలో అధికారులు సర్వే చేయాలని విన్నవించాడు. అంతేకాకుండా దీనిపై కోర్టులో కేసు వేశాడు. అప్పటి నుంచి అధికారుల వేధింపులు ఎక్కువ కావడంతో ఆదివారం భీమన్న పురు గుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

## సాగునీటి కోసం రైతన్న తంటాలు



నారాయణపేట జిల్లాలో రైతుకు సాగునీటి కష్టాలు తప్పడంలేదు. పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. సంగం బండ రిజర్వాయర్ రైట్ హైలెవెల్ కెనాల్ పరిధిలో సాగునీరు అందక సుమారు వందల ఎకరాలు ఎండుముఖం పడుతున్నాయి. వంతుల వారి విధానంలో కాల్వకు పూర్తిస్థాయిలో సాగునీరు రాకపోవడంతో ఆయకట్టు పరిధిలోని మాగనూరు మండలం తాళంకేరికి చెందిన కొందరు రైతులు చిన్నవాగు కాల్వలో ట్రాక్టర్ల ద్వారా మోటర్లు ఏర్పాటు చేసి నీటిని తోడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కొంతమంది రైతులు కిలోమీటర్ల పొడవునా పైపులు వేసుకొని నీటికోసం ఎదురుచూస్తున్నారు. కాల్వలకు సాగునీరు వచ్చేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. – మాగనూరు




### ఒక్క తడి దొరికినా పంట చేతికొచ్చు

మళ్లీ.. ఎనుకటి కాంగ్రెస్ కాలమొచ్చింది. పదేండ్లు కరువు లేకుండ బతికినం. నిరుడు ముందటేడు కాల్వలు వదిలితె కుంటలు నిండి బోర్లల్ల ఊట పెరిగేది. ఒక్క తడి కాడ మక్కజొన్న మొదలారిపోయింది. ఐదెకరాలు వరి పెడితె ఎకరం ఎండింది. మిగితాది వరుస తళ్లు పెడుతున్న ఎప్పుడు పోయేది తెలువదు. రెండు బోర్లుంటె ఒకటిపోయింది. ఇంకోటి ఆగిపోస్తుంది. పంటనీళ్లు లేక ఎండితె పానం ఉసూరుమనిపిస్తుంది. అప్పుల పాలై ఆగమవుడే. మక్కజొన్న ఏపుగా వచ్చింది. బిర్రుగా పండుతదని ఆశ ఉండె. నీళ్ల కరువొస్తదని అనుకోలే. తిండి మందం వరి పంట చేతికొస్తే అదే పదివేలని దేవున్ని మొక్కుతున్నం. – సుడిగెల సోంమల్లయ్య, రైతు, కడవెండి, మం: దేవరుప్పుల, జిల్లా జనగామ

# అన్నదాత కుతకుత!

- రుణమాఫీపై మాటతప్పిన సర్కారు
- రూ.2 లక్షలు దాటిన రుణాలకు ఎగనామం
- అసెంబ్లీ వేదికగా మంత్రి తుమ్మల తేటతెల్లం
- రుణం చెల్లిస్తే.. రూ.2 లక్షలు మాఫీ చేస్తం.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పలుమార్లు వెల్లడి
- పూటకో మాటతో రుణమాఫీపై రైతులకు మొండి‘చెయ్యి’



4.11 ఏ కుటుంబానికి అయితే రూ. 2.00 లక్షలకు మించిన రుణం ఉంటుందో, ఆ రైతులు రూ.2.00 లక్షలకు పైబడివున్న రుణాన్ని మొదట బ్యాంకుకు చెల్లించాలి. ఆ తరువాత, అర్హతగల రూ. 2.00 లక్షల మొత్తాన్ని రైతు కుటుంబీకుల రుణ ఖాతాలకు బదిలీ చేస్తారు.

రుణమాఫీ మార్గదర్శకాలను పేర్కొన్న కాంగ్రెస్ ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 23(నమస్తే తెలంగాణ): ఒకే మంత్రి, ఒకే ప్రభుత్వం, ఒకే ఉత్తర్వు.. కానీ మాటలు మాత్రం వేర్వేరు. రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణం చెల్లించిన తర్వాత రూ.2 లక్షలు ఖాతాల్లో జమ చేస్తామన్న అదే నోటితో, నేడు అసలు రూ.2 లక్షలకు పైగా రుణ మాఫీ చేస్తామని తాము హామీ ఇవ్వలేదని, తమ ప్రభుత్వ నిర్ణయం కాదంటూ అదే మంత్రి తప్పించుకుంటున్నారు. తమ ఇందిరమ్మ ప్రభుత్వంలో, ప్రజా ప్రభుత్వంలో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేసి తీరుతామంటూ ఫోజులు కొట్టిన సీఎం, మంత్రులు ఇప్పుడు రుణమాఫీ చేయలేక చేతులెత్తేశారు. పూటకో మాట, గడువుకో లెక్క చెప్తూ రైతులను నిండాముంచారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల సాక్షిగా రూ.2 లక్షల రైతు రుణమాఫీకి ప్రభుత్వం చరమగీతం పాడింది. కాంగ్రెస్ సర్కారు వస్తే తమకు రూ.2 లక్షల రుణమాఫీ అవుతుందని కొండంత ఆశపడిన రైతులను పచ్చిమోసం చేసి మొండిచెయ్యి చూపించింది. దీంతో రెండు లక్షలకు పైగా ఉన్న మొత్తాన్ని బ్యాంకుల్లో చెల్లించి, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షలు ఎప్పుడు మాఫీ అవుతాయోనని ఎదురుచూసిన రైతాంగం ఇప్పుడు కుతకుత ఉడికిపోతున్నది. ప్రభుత్వంపై ఆగ్రహంతో రగిలిపోతున్నది. అధికారంలోకి రాగానే 2023 డిసెంబర్ 9న ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీని విస్మరించిన సీఎం రేవంత్‌రెడ్డికి ఏడు నెలల తర్వాత రుణమాఫీ హామీ గుర్తుకొచ్చింది. ఈ మేరకు 2024 జులై 15న రుణమాఫీకి సంబంధించి మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మార్గదర్శకాల్లో రూ.2 లక్షల లోపు రుణాలతోపాటు రూ.2 లక్షలకు పైగా ఉన్నా వాటిలో రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

### ఊరూరా దేవుళ్లపై ఒట్టేసిన సీఎం

అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ఆ తర్వాత దాన్ని మర్చిపోయారు. ఏడు నెలల తర్వాత లోక్‌సభ ఎన్నికల ముంగిట మళ్లీ రుణమాఫీ హామీ పత్రాన్ని బయటకు తీశారు. ఎన్నికల ప్రచారం కోసం ఏ జిల్లాకు వెళ్తే ఆ జిల్లాలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రంలోని దేవుండ్లపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోపు రుణామాఫీ చేస్తామంటూ ఒట్టేసి చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారనే విమర్శలు వచ్చాయి. ఆ ఎన్నికలు ముగిసిన నెలకు తీరిగ్గా ఉత్తర్వులు జారీచేసి ఆగస్టు 15 వరకు అరకొరగా రుణమాఫీ చేశారు. నవంబర్ 30న మరో దశ రుణమాఫీ చేశారు. అది కూడా రూ.2 లక్షల లోపు మా త్రమే చేశారు. ఇందులో కూడా చాలామంది రైతులు తమకు రుణమాఫీ కాలేదంటూ ఇప్పటికీ గగ్గోలు పెడుతున్నారు. రూ.2 లక్షలకు పైగా రుణం గల రైతుల పరిస్థితి నేడు అగమ్యగోచరంగా మారింది. కాంగ్రెస్ సర్కారులో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రుల మాటలకు, ప్రభుత్వం ఇచ్చిన ఉత్వర్వులకు విలువే లేకుండా పోతుందని తేటతెల్లమైంది.

### పూటకో మాట.. గడియకో లెక్క..

కాంగ్రెస్ పాలనలో రైతుల రూ.2 లక్షల రుణ మాఫీ అంశం పూటకో మాట, గడియకో లెక్క చందంగా మారింది. చివరికి సర్కారు ఎగనామం పెట్టింది. రుణమాఫీపై తొలుత మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో 72 లక్షల పంట రుణ ఖాతాలు ఉన్నాయని, వీరందరికీ రుణ మాఫీ చేయాలంటూ రూ.49 వేల కోట్లు అవసరమని వెల్లడించారు. ఆ తర్వాత 42 లక్షల మందే రైతులు ఉన్నారని, ఇందుకు రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని మరోమాట చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వమే స్వయంగా వెల్లడించింది. చివరికి రూ.20,616 కోట్లతో రుణమాఫీని ముగించేసింది. ఇదెలా అని సీఎంను ప్రశ్నిస్తే.. ‘అదంతా బ్యాంకుల తప్పు. తొలుత లాంగ్‌టర్మ్ రుణాలను కూడా ఇందులో కలిపి రూ.31 వేల కోట్లు అవసరం అవుతాయని చెప్పారు. కానీ తర్వాత మళ్లీ మేం నిర్దిష్ట ఫార్మాట్ పంపిస్తే రూ.20 వేల కోట్లకు తగ్గింది’ అంటూ మాయ లెక్కలను వెల్లడించారు. ఈ విధంగా రుణమాఫీ అర్హులు, అవసరమైన నిధులపై మూడుసార్లు మాటమార్చడం గమనార్హం. ఇక చివరికి సీఎం చెప్పిన ఏ లెక్క ప్రకారం కూడా రుణమాఫీ చేయలేదు. మొత్తం 42 లక్షల మంది రైతుల్లో 25.35 లక్షల మందికి రూ.20,616 కోట్లు రుణ మాఫీ చేసి మిగిలిన 16.65 లక్షల మంది రైతులకు సర్కార్ ఎగనామం పెట్టింది. ఇంకా రూ. 10,384 కోట్లు రైతులకు బాకీ పడి ఉంది. ఈ ప్రభుత్వం రుణమాఫీ కోసం బడ్జెట్‌లో పెట్టిన మొత్తాన్నైనా ఖర్చు చేయకపోవడం గమనార్హం. నిరుడు రుణమాఫీ కోసం రూ.26 వేల కోట్లు బడ్జెట్‌లో పెట్టింది. ఇందులో రూ. 20, 616 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. అంటే రూ.5,384 కోట్లు ఖర్చు చేయకుండానే వదిలేసింది.

### ఇవీ లెక్కలు

| | |
|---|---|
| రుణమాఫీ చేయాల్సిన మొత్తం | రూ.31 వేల కోట్లు |
| ఇప్పటివరకు చేసిన రుణమాఫీ | రూ. 20,616 కోట్లు |
| ఇంకా చేయాల్సిన రుణమాఫీ | రూ.10,384 కోట్లు |
| సర్కారు లెక్క ప్రకారం రుణమాఫీ అర్హులు | 42 లక్షలు |
| ఇప్పటివరకు రుణమాఫీ పొందిన రైతులు | 25.35 లక్షలు |
| ఇంకా రుణమాఫీ కావాల్సిన రైతులు | 16.65 లక్షలు |



- ఏ కుటుంబానికి అయితే రూ.2 లక్షలకు మించిన రుణం ఉంటదో, ఆ రైతులు రూ.2 లక్షలకు పైబడి ఉన్న మొత్తాన్ని మొదట బ్యాంకుకు చెల్లించాలి. ఆ తర్వాత అర్హత గల రూ.2 లక్షల మొత్తాన్ని రైతు కుటుంబీకుల రుణ ఖాతాలకు బదిలీ చేస్తారు.
  – ఇదీ 2024 జులై 15న ప్రభుత్వం జారీచేసిన రుణమాఫీ మార్గదర్శకాల్లో ప్రభుత్వం పేర్కొన్న అంశం.
- రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రూ.2 లక్షల పైగల రుణాన్ని రైతులు బ్యాంకులకు చెల్లిస్తే, ఆ మరుక్షణమే రూ.2 లక్షలను ఖాతాలో వేసే బాధ్యతను నేనే తీసుకుంటా.
  –2024 సెప్టెంబర్ 15న గాంధీభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు.
- రూ.2 లక్షల రుణమాఫీ పూర్తయ్యాక ఆపై రుణాలకు షెడ్యూల్ ప్రకటిస్తాం. 2.5 లక్షల వరకు ఎప్పుడు చెల్లించాలి, 3 లక్షలు ఉన్నవారు ఎప్పుడు చెల్లించాలో తేదీలు ప్రకటిస్తాం. ఆ తర్వాత రైతుల ఖాతాల్లో రూ.2 లక్షలు జమ చేస్తాం.
  – 2024 సెప్టెంబర్ 24న ఖమ్మంలో మీడియాతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యలు
- రైతులకు రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేయాలనేదే ప్రభుత్వ నిర్ణయం. రూ.2 లక్షలకు పైగా రుణ మాఫీ నిర్ణయం లేదు. 2 లక్షలలోపు రుణాలున్న 25.35 లక్షల మంది రైతుల వివరాలు మా వద్దకు చేరాయి. వారికి 20,616 కోట్లు జమ చేసినం.
  – ఇదీ 2025 మార్చి 22న అసెంబ్లీలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటన



దేవన్నపేట పంపుహౌస్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా, మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

## ఎండిన పంటకు ఎకరాకు 25 వేలు ఇవ్వాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి
- పూర్తయిన పనులను ప్రారంభించే సత్తాలేని ప్రభుత్వం
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- చేతకాని సర్కారు వల్ల రైతాంగానికి నష్టం
- మాజీ ఎమ్మెల్యే రాజయ్య

హనుమకొండ సబర్బన్, మార్చి 23 : అందుబాటులో సాగు నీరు ఉన్నప్పటికీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేక పంటలు ఎండిపోయాయని, ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు. గురువారం దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేట పరిధిలో నిర్మించిన పంప్‌హౌస్‌ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల పరిధిలో 5 లక్షల 57 వేల ఎకరాల్లో రెండు పంటలకు నీళ్లు వచ్చేలా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారన్నారు. దేవాదుల మూడో దశ కింది రూ.1494 కోట్లతో రామప్ప నుంచి ఉనికిచర్ల వద్దకు టన్నెల్‌ను పూర్తి చేశారని తెలిపారు. 15 నెలలుగా పనులు సాగకపోవడంతో రైతాంగం తీవ్ర నష్టం చూడాల్సి వచ్చిందన్నారు. కేవలం రూ. ఆరు కోట్లు విడుదల చేయకపోవడంతో 34 రోజుల పాటు ఓఅండ్ఎం స్టాఫ్ స్ట్రయిక్ చేస్తే రైతులు రూ. 600 కోట్లు నష్టపోయారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. చివరికి అధికారులు, మంత్రితో మాట్లాడితే రూ.6 కోట్లు విడుదల చేయగా పంపులు నడిచాయని చెప్పారు. దేవాదుల ప్రాజెక్టు బలోపేతానికి కేసీఆర్ సమ్మక్క సాగర్ ప్రాజెక్టును నిర్మించి 365 రోజుల పాటు సాగు నీరు అందిస్తే, ఈ చేతకాని సర్కారు వల్ల రైతాంగం నష్టపోయిందని తాటికొండ రాజయ్య మండిపడ్డారు.